ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

యాదాద్రి భువనగిరి

తెలుగు దినపత్రిక

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 190

సోమవారం 13 జనవరి 2025 | చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్ | HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD

## మార్చి 21 నుంచి ఐపీఎల్

మే 25న ఫైనల్.. ఉప్పల్‌లో రెండు క్వాలిఫయర్స్



07

## అగ్ర రాజ్యం.. అసాధ్యం కాదు

### మన యువత సామర్థ్యాలతో కచ్చితంగా ఎదుగుతాం: ప్రధాని

భారతీయ యువత శక్తిసామర్థ్యాలతో కచ్చితంగా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మనదేశం అగ్రరాజ్యంగా అభివృద్ధి చెందడం కష్టమని కొందరు అంటుంటారని.. కానీ అసాధ్యమైతే కాదని తేల్చిచెప్పారు.



02

## నేటి నుంచే మహా కుంభమేళా!

45 రోజుల పాటు నిర్వహణ..
కోట్లాదిగా రానున్న భక్తులు

విస్తృత ఏర్పాట్లు చేసిన యూపీ..
ఏఐ సాంకేతికతతో దిశా నిర్దేశం



02



## 'భూ భారతి' భూములకే భరోసా

సాగు యోగ్యమైతేనే పెట్టుబడి సాయం

రైతు భరోసా మార్గదర్శకాలు విడుదల

.. వివరాలు 3లో



## మందా జగన్నాథం కన్నుమూత


అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం నిమ్స్ ఆస్పత్రికి

22 రోజులుగా కొనసాగిన చికిత్స

ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి

సీఎం రేవంత్, చంద్రబాబు, కేసీఆర్ సంతాపం

.. వివరాలు 3లో




# ఎవరు సలహాలిచ్చినా స్వీకరించేందుకు సిద్ధం

### విద్యార్థి రాజకీయాలు చారిత్రక అవసరం



- సైద్ధాంతిక భావజాలం లేనందునే ఫిరాయింపులు
- యూనివర్సిటీలకు పూర్వ వైభవం తీసుకొస్తున్నాం
- విద్యాసాగర్‌రావు సహకారం రాష్ట్రానికి అవసరం
- కేంద్ర మంత్రులు సహకరించాలి: సీఎం రేవంత్
- హైడ్రా.. అభినందనీయం: విద్యాసాగర్‌రావు
- విద్యాసాగర్‌రావు స్వీయచరిత్ర 'ఉనికి' ఆవిష్కరణ

**విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల రాజకీయాలు చారిత్రక అవసరమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రస్తుత రాజకీయాల్లో సైద్ధాంతిక భావజాలం ఉన్నవారు లేకపోవడం వల్లే పార్టీ ఫిరాయింపులు జరుగుతున్నాయని తెలిపారు.**

**హైదరాబాద్,రోమింగ్‌న్యూస్:** విద్యార్థి రాజకీయాల్లో సిద్ధాంతపరంగా రాణించిన వారుంటే.. ప్రజాప్రతినిధులుగా అధికారంలో ఉన్నా, లేకపోయినా.. నమ్మిన సిద్ధాంతం కోసం దశాబ్దాలపాటు జీవితాలను త్యాగం చేస్తారని తెలిపారు. ప్రజా సమస్యలపై విద్యార్థి సంఘాలు పోరాటాలు చేయడం వల్లనే చైతన్యం వస్తుందని, ఆయా

మిగతా 2 లో

## ఎమ్మెల్యేల వాగ్వాదం

### ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డి, సంజయ్‌కుమార్ మధ్య తోపులాట

- కరీంనగర్ ఉమ్మడి జిల్లా సమీక్ష రసాభాస
- సంజయ్ మాట్లాడుతుండగా అడ్డుకున్న కౌశిక్..
- నీది ఏ పార్టీ అంటూ నిలదీత
- రాజీనామా చేసి గెలవాలని సవాల్
- నువ్వే పార్టీ వచ్చావన్న సంజయ్



**కరీంనగర్, రోమింగ్‌న్యూస్:** బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి గెలిచి కాంగ్రెసలో చేరిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ మధ్య వాగ్వాదం, తోపులాటతో ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళిక సమీక్షా సమావేశం రసాభాసగా మారింది. ఆదివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన కలెక్టరేట్ ఆడిటోరియంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజా ప్రతినిధులు, ఆయా జిల్లాల

మిగతా 2 లో

# భరోసా మోసంపై చర్చకు సిద్ధమా?

- రాహుల్, రేవంత్ ఎవరైనా హామీలు నెరవేర్చారా?
- కాంగ్రెస్ నాయకులు ఊర్లోకి వస్తే రైతులు నిలదీయాలి
- సీఎం రేవంత్, కాంగ్రెస్ నేతలపై హరీశ్‌రావు ఆగ్రహం

**సిద్దిపేట, రోమింగ్‌న్యూస్:** కాంగ్రెస్ పాలకులు రైతులను నట్టేట ముంచి, నిస్సిగ్గుగా సంబురాలు చేసుకుంటున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు తీవ్రంగా మండిపడ్డారు. రైతులు కాంగ్రెస్ నేతలు గ్రామాలకు వస్తే నిలదీస్తారని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వరకు ఎవరైనా ఒక హామీ

మిగతా 5 లో





05

కార్లలోనూ పలువురి ప్రయాణం.. టోల్‌గేట్ల వద్ద బారులు

సంక్రాంతి ప్రభావంతో హైదరాబాద్ రహదారులు ఖాళీ

## పండక్కి వూరేలాల్సిందే..

మూడు రోజుల్లో ఏపీ వైపునకు 60 వేలకు పైగా బైక్‌లు

బస్సులు, రైళ్లలో చార్జీల మోత.. తాళలేక బైక్‌లపై సొంతూళ్లకు

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
ఆదివారం
12 జనవరి
2025




# ఎవరు సలహాలిచ్చినా స్వీకరించేందుకు సిద్ధం


మొదటి పేజీ తరువాయి

సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. రాజకీయ పార్టీల పోరాటం కంటే.. ఓయూ, కేయూ విద్యార్థులు ముందుండి ఉద్యమించడం వల్లనే తెలంగాణ ఏర్పాటు సాధ్యమైందని అన్నారు. అలాంటి విద్యార్థి రాజకీయాలను తెలంగాణలో పునరుద్ధరించాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని పార్టీలూ విద్యార్థి రాజకీయాలను ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు.

ఆదివారం తాజ్‌కృష్ణాలో జరిగిన ఓ కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు స్వీయచరిత్ర 'ఉనిక' పుస్తకాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. ఒకప్పుడు ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి రాజకీయాల్లో ఓవైపు జార్జిరెడ్డి, మరోవైపు సాగర్‌జీ (విద్యాసాగర్‌రావు) వంటివారు నమ్మిన సిద్ధాంతం కోసం గట్టిగా నిలబడ్డారని తెలిపారు. విద్యార్థి దశలో సిద్ధాంతపరమైన భావజాలం ఉన్నవారు తక్కువగా ఉండడం, విద్యార్థి రాజకీయాల్లో చైతన్యం కోల్పోవడం వల్లనే ప్రజాప్రతినిధులు కావాలనుకుంటున్నవారు ఏ పార్టీ అయినా ఫరవాలేదని, తమకు పదవి ఉంటే చాలునని అనుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయని రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. 'పార్టీ ఫిరాయింపులపై నేను మాట్లాడితే బాగోదేమో' అంటూ నే.. తనదైన శైలిలో పై వ్యాఖ్యలు చేశారు.

### మూడో తరం కనిపించడంలేదు..

విద్యార్థి రాజకీయాల్లో మొదటి తరంలో బూర్గుల రామకృష్ణారావు, పీవీ నర్సింహారావు, మర్రి చెన్నారెడ్డి, రెండో తరంలో జైపాల్‌రెడ్డి, విద్యాసాగర్‌రావు, దత్తాత్రేయ వంటివారు రాణిస్తే.. మూడో తరంలో ఎవరూ కనిపించడం లేదని సీఎం రేవంత్ అన్నారు. యూనివర్సిటీలు ఉనికి కోల్పోయే పరిస్థితులు నెలకొన్నాయని, వాటికి పూర్వవైభవం కల్పించేందుకు తమ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపా రు. మహారాష్ట్ర, తమిళనాడు రాష్ట్రాలకు ఉమ్మడి గవర్నర్‌గా బాధ్యతలను సమర్థంగా నిర్వహించిన విద్యాసాగర్‌రావు.. తెలంగాణ గౌరవాన్ని నిలబెట్టారని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశంసించారు. ఐదు దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో ఎలాంటి ఆరోపణలు ఎదుర్కొనకపోవడం విద్యాసాగర్‌రావు గొప్పతనమని కొనియాడారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ఎవరు సలహాలిచ్చినా తీసుకోవడానికి తనకు ఎలాంటి భేషజాలు లేవని, ముఖ్యంగా సాగర్‌జీ వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో అవసరమని అన్నారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, బీజేపీ



ఎంపీ కె.లక్ష్మణ్‌తోపాటు బీఆర్ఎస్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ వంటివారు సహకరించాలని కోరారు. జల్లికట్టు సమస్య వస్తే.. తమిళనాడులో అన్ని పార్టీలూ కేంద్రంతో పోరాటం చేసి సాధించుకున్నాయని, తెలంగాణ అభివృద్ధి విషయంలో కూడా అన్ని పార్టీలు ఒక్కటి కావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. సీహెచ్.విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి హైడ్రాను ఏర్పాటు చేయడం, మూసీ పునరుజ్జీవం కోసం చర్యలు తీసుకోవడం అభినందనీయమన్నారు. ప్రపంచదేశాల్లోని ముఖ్యనగరాలకు దీటుగా హైదరాబాద్‌ను



తీర్చిదిద్దడం ప్రశంసనీయమని పేర్కొన్నా రు.

### ఉన్నత పదవులకు వన్నె తెచ్చిన విద్యాసాగర్‌రావు: దత్తాత్రేయ

విద్యాసాగర్‌రావు అసెంబ్లీ ఎన్నికల్లో తొలిసారిగా పోటీ చేసినప్పుడు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయనకు తానే బీ ఫాం ఇచ్చానని అన్నారు. ఎన్నో ఉన్నత పదవులకు ఆయన వన్నె తెచ్చారని ప్రశంసించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరుకావడం మంచి పరిణామమన్నారు.

ఒడిసా గవర్నర్ హరిబాబు మాట్లాడుతూ.. గోదావరి, కృష్ణా జలాల సద్వినియోగం కోసం విద్యాసాగర్‌రావు విశేష కృషి చేశారన్నారు. రాష్ట్ర మంత్రి డి.శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. నమ్మిన సిద్ధాంతం కోసం విద్యాసాగర్‌రావు రాజీ పడకుండా నిలిచారన్నారు. ఈ కారక్రమంలో కేంద్ర మంత్రి బండి సంజయ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, బీజేపీ ఎంపీలు కె.లక్ష్మణ్, డీకే అరుణ, కేంద్ర మాజీ మంత్రి టి.సుబ్బిరామిరెడ్డి, మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రాంచందర్‌రావు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

### స్వామి వివేకానందకు సీఎం నివాళి

స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సీఎం రేవంత్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో నివాళి అర్పించారు.

# నేటి నుంచే మహా కుంభమేళా!



ప్రయాగ్‌రాజ్, జనవరి 12: మహా కుంభమేళా సోమవారం నుంచి ప్రారంభంకానుంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అంగరంగ వైభవంగా నిర్వహిస్తు న్న ఈ మహాకుంభ మేళా మొత్తం 45 రోజుల పాటు సాగనుంది. పుష్య పౌర్ణమి ని పురస్కరించుకుని సోమవారం తొలిపుణ్యస్నానంతో ఈ మహా క్రతువుకు యూపీ సర్కారు శ్రీకారం చుట్టనుంది. గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతంలో నిర్వహించే మహా కుంభమేళాకు దేశ, విదేశాల నుంచి దాదాపు 35 కోట్ల మంది ప్రజలు హాజరవుతారని ప్రభుత్వం అంచనా వేసింది. ఈ మేరకు కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసింది. మహాకుంభమేళా సోమవారం లాంఛనంగా ప్రారంభం కానుండగా.. దీనికి రెండు రోజుల ముందు అంటే శనివారమే 25 లక్షల మంది ప్రజలు పవిత్ర స్నానా లు ఆచరించారని అధికారులు తెలిపారు. ఇక, మహాకుంభమేళా ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో తరచుగా పరిశీలించిన సీఎం యోగి ఆదిత్యనాథ్.. దీనిని భారత దేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీకగా అభివర్ణించారు. ఆధునికతకు, స్వచ్ఛతకు, భద్రతకు అతి పెద్ద ఉదాహరణగా నిలుస్తుందన్నారు. "ఇది కేవలం ఓ మతానికి సంబంధించిన కార్యక్రమం కాదు. సామాజిక, ఆధ్యాత్మిక ఐక్యతకు ప్రతీక" అని సీఎం ఉద్ఘాటించారు. ఇక, ప్రభుత్వ భవనాలు సహా మహా కుంభమేళా జరిగే చోట భారీ ఎత్తున హిందూ ధర్మాన్ని కళ్లకు కట్టినట్టు చూపించే కుడ్య, తైలవర్ణ చిత్రాలను రూపొందించారు. పూర్ణ కుంభ, శంఖు ఆకృతులు భక్తులను అమితంగా ఆకట్టుకుంటున్నాయి. ఎక్కడికక్కడ సమూహ నిర్వహణ విధానాలను అవలంభిస్తున్నారు. ఆదివారం(జనవరి 12) స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని(జాతీయ యువజన దినోత్సవం) ప్రయాగ్‌రాజ్‌లో 'యువ మహాకుంభ్'ను నిర్వహించారు.

# అగ్ర రాజ్యం.. అసాధ్యం కాదు

## మన యువత సామర్థ్యాలతో కచ్చితంగా ఎదుగుతాం: ప్రధాని



న్యూఢిల్లీ, జనవరి 12: భారతీయ యువత శక్తిసామర్థ్యాలతో కచ్చితంగా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా ఆవిర్భవిస్తుందని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు. మనదేశం అగ్రరాజ్యంగా అభివృద్ధి చెందడం కష్టమని కొందరు అంటుంటారని.. కానీ అసాధ్యమైతే కాదని తేల్చిచెప్పారు. 'వికసిత్ భారత్' స్ఫూర్తితో ప్రతి అడుగు, విధానం, నిర్ణయం తీసుకుంటే.. భారత్‌ను ఎవరూ ఆపలేరని తెలిపారు. స్వామి వివేకానంద 163వ జయంతిని పురస్కరించుకుని ఆదివారమిక్కడ నిర్వహించిన జాతీయ యువజనోత్సవంలో.. దేశం నలుమూలల నుంచీ వచ్చిన 'వికసిత్ భారత్ యువ నేతల చర్చ'ను ఆయన ప్రారంభించారు. ఏ దేశమైనా ముందుకు సాగడానికి భారీ లక్ష్యాలు పెట్టుకోవాలని, భారత్ ఇప్పుడదే చేస్తోందని ఈ సందర్భంగా అన్నారు. వివిధ రంగాల్లో నిర్దేశించుకున్న లక్ష్యాలను గడువు కంటే ముందే చేరుకుంటున్నామని చెప్పారు. "1930ల్లో దారుణ ఆర్థిక సంక్షోభం నుంచి బయటపడి అమెరికా అగ్రరాజ్యంగా మారింది. కనీస మౌలిక వసతులు కూడా లేని వెనుకబడిన దేశంగా ఉన్న సింగపూర్ ప్రఖ్యాత ఆర్థిక శక్తిగా ఆవిర్భవించింది. భారీ లక్ష్యాలను నిర్దేశించుకుని చిత్తశుద్ధితో వాటిని నెరవేర్చుకునేందుకు కృషిచేయాలని ఈ రెండు ఉదాహరణలు నొక్కిచెబుతున్నాయి. బహిరంగ మలవిసర్జన దేశంగా మారాం. కొవిడ్ వ్యాక్సిన్లు ఉత్పత్తి చేశాం. ప్రజలందరికీ అందించాం. వచ్చే దశాబ్దంలో ఒలింపిక్స్‌కు ఆతిథ్యం ఇవ్వాలని ఆశిస్తున్నాం. ఈ దిశగా పూర్తి అంకితభావంతో పనిచేస్తున్నాం. వచ్చే దశాబ్దంలో మన ఎకానమీ రూ.10 లక్షల కోట్లకు చేరుతుంది. 2047 వరకు ఈ పాతికేళ్లూ మన దేశానికి స్వర్ణయుగం (అమృతకాలం). మన యువత వికసిత్ భారత్ కల నెరవేరుస్తారని నాకు సంపూర్ణ విశ్వాసం ఉంది' అని మోదీ తెలిపారు. యువతరంపై స్వామి వివేకానందకు చాలా నమ్మకం ఉండేదని.. అన్ని సమస్యలకూ వారే పరిష్కారాలు కనుక్కొంటారని చెప్పేవారని చెప్పారు. తనకు కూడా వారిపై నమ్మకం ఉందని అన్నారు. వివేకానందుడికి నివాళు లర్పించారు.

### రిపబ్లిక్ డే ముఖ్య అతిథిగా సుబియాంతో

ఈ నెల 26న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవాలకు ముఖ్య అతిథిగా ఇండొనేషియా అధ్యక్షుడు ప్రభోవో సుబియాంతో హాజరుకానున్నారు. భారత్ నుంచి ఇండొనేషియా బ్రహ్మోస్ క్షిపణలు కొనుగోలు చేయనుందనే కథనాల నడుమ సుబియాంతో పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. ఒప్పందం విలువ 450 మిలియన్ డాలర్లుగా ఉండే అవకాశం ఉందని రక్షణశాఖ వర్గాల ద్వారా తెలిసింది. భారత పర్యటన ముగిసిన వెంటనే సుబియాంతో పాకిస్థాన్ వెళ్లాలనుకున్నారని, అయితే భారత్ అభ్యంతరం తెలపడంతో తన నిర్ణయాన్ని మార్చుకున్నారని సమాచారం. కాగా, అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ ప్రమాణ స్వీకారోత్సవానికి భారత్ తరఫున విదేశాంగ మంత్రి జైశంకర్ హాజరుకానున్నారు.

# రాహుల్‌జీ ఇదేనా మీ 'సంవిధాన్ బచావో'?: కేటీఆర్



హైదరాబాద్, జనవరి 12 : ఒకవైపు రాజ్యాంగం అమలుకోసం పోరాటం చేస్తానంటూ.. రాహుల్‌గాంధీ అంబేడ్కర్ రాసిన పుస్తకాన్ని పట్టుకొని తిరుగుతుంటే.. రాష్ట్రంలో ఆ పార్టీ మాత్రం రాజ్యాంగ విరుద్ధంగా వ్యవహరిస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. హైదరాబాద్‌లో రాహుల్ గాంధీ సంవిధాన్ బచావో(రాజ్యాంగాన్ని కాపాడండి) ర్యాలీ చేస్తానంటుంటే.. ఇక్కడ టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మాత్రం మరికొంత మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరతారని ప్రకటిస్తున్నారని విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించడానికి గొప్పమార్గం ఇదేనా? రాహుల్‌జీ తెలంగాణలో కాంగ్రెస్ అనుసరిస్తున్న విధానం రాజ్యాంగ ఉల్లంఘన కాదా? అని కేటీఆర్ ఆదివారం ఓ ప్రకటనలో ప్రశ్నించారు.

# ఆన్‌లైన్‌లో ఉద్యోగుల సమస్యల పరిష్కారం: సీతక్క

హైదరాబాద్, జనవరి 12 : పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు చెందిన ఉద్యోగుల సర్వీస్ అంశాలు, ఇతర సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఉద్యోగులు సచివాలయం చుట్టూ తిరగకుండా ఆన్‌లైన్ విధానంలో వారి సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఆ శాఖల మంత్రి ధనసరి అనసూయసీతక్క ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న చేపట్టే ఆన్‌లైన్ మీటింగ్‌లో రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుతోపాటు తాను కూడా పాల్గొననున్నట్లు ఆమె వెల్లడించారు.

# ఎమ్మెల్యేల వాగ్వాదం

మొదటి పేజీ తరువాయి

కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేలు తమ అభిప్రాయాలు తెలపాలని ఇన్‌చార్జి మంత్రి కోరారు. ఈ క్రమంలో సంజయ్‌కుమార్ (జగిత్యాల) మాట్లాడడానికి మైకు తీసుకోగా కౌశిక్‌రెడ్డి (హుజూరాబాద్) అభ్యంతరం చెబుతూ ఆయన (సంజయ్‌కుమార్) ఏ పార్టీకి చెందిన వ్యక్తి అని, ఎందుకు మాట్లాడడానికి అవకాశం ఇస్తున్నారని అగ్రహంగా ప్రశ్నించారు.

ఆయనపైకి దూసుకువెళ్లే ప్రయత్నం చేశారు. దానికి సంజయ్‌కుమార్ దీటుగా స్పందించగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆయనకు అండగా నిలిచారు. 'నువ్వు ఏ పార్టీ నుంచి వచ్చావు' అంటూ కౌశిక్ రెడ్డిని ప్రశ్నించారు. ఈ సందర్భంలో మాటా మాట పెరిగి ఒకరిని ఒకరు తోసివేసుకుంటూ వ్యక్తిగత దూషణలకు దిగారు. దీంతో పోలీసులు జోక్యం చేసుకుని కౌశిక్ రెడ్డిని బయటకు తీసుకువెళ్లారు. గేటు బయటే నిలబడిన ఆయన 'సిగ్గూ.. లజ్జ ఉంటే రాజీనామా చేసి మళ్లీ గెలవమ'ని సంజయ్ కుమార్‌కు సవాల్ విసిరారు. సమావేశంలో కౌశిక్‌రెడ్డి వ్యవహరించిన తీరుపై మంత్రులు ఉత్తమ్, పొన్నం ప్రభాకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన వ్యవహారం సరిగా లేదని... మార్చుకోవాలని హెచ్చరించారు. తనను విమర్శించడానికి రాజీనామా చేయమని అడగడానికి కౌశిక్ రెడ్డికి ఎలాంటి అధికారం లేదని సంజయ్‌కుమార్ అన్నారు. ఆయనపై స్పీకర్‌కు ఫిర్యాదు చేస్తానని చెప్పారు.

### అచ్చోసిన ఆంబోతులా కౌశిక్ రెడ్డి: బల్మూరు

హైదరాబాద్: బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అచ్చోసిన ఆంబోతులాగా ప్రవర్తిస్తున్నాడని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ ధ్వజమెత్తారు. మీడియాలో కనపడేందుకే పిచ్చిచేష్టలు చేస్తున్నాడని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఆయన ఇలాగే ప్రవర్తిస్తే రోడ్డుపై గుడ్డలూడదీసి కొట్టే రోజు వస్తుందని హెచ్చరించారు.

### సాగుకు యోగ్యమైన భూములకు రైతు భరోసా: ఉత్తమ్

రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయానికి యోగ్యమైన భూమికి పంట వేసినా వేయక పోయినా రైతు భరోసా ఇస్తామని మంత్రి ఉత్తమ్ తెలిపారు. రోడ్లు, రియల్ ఎస్టేట్ స్థలాలు, సాగుకు యోగ్యం కాని భుములకు ఇవ్వబోమని స్పష్టం చేశారు. వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ.12 వేలు



అందిస్తామన్నారు. అర్హులరందరికీ రేషన్ కార్డులు ఇస్తామని చెప్పారు. ఈ నెల 26 నుంచి రేషన్ కార్డుల పంపిణీ మొదలవుతుందన్నారు. వచ్చే నెల నుంచి సన్న బియ్యం అందిస్తామని తెలిపారు. కాళేశ్వరం నుంచి నీరు ఎత్తిపోయకుండానే రాష్ట్ర వ్యాప్తంగా 66.7 లక్షల ఎకరాల్లో 155 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందన్నారు. సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు తదితరులు పాలొన్నారు.

### పోలీసులకు కేసీఆర్ ఏం తక్కువ చేశాడు అన్నీ మర్చిపోయారా?: కౌశిక్ రెడ్డి

'పోలీసులకు కేసీఆర్ ఏం తక్కువ చేశాడు.. ఫార్చునర్లు, ఇన్నోవాలు ఇచ్చాడు.. పోలీస్ స్టేషన్లను ఆధునీకరించాడు.. జీతాలు పెంచాడు.. అన్ని మరిచిపోయారా'.. అని పాడి కౌశిక్‌రెడ్డి ప్రశ్నించారు. జిల్లా సమీక్షా సమావేశ మందిరం నుంచి బయటకొచ్చిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడేళ్ల తర్వాత కేసీఆర్ ముఖ్యమంత్రి కాకతప్పదని, ఎక్స్‌ట్రాలు చేస్తున్న అధికారులు ఎవర్నీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. పార్టీ మారిన వారు, రాజీనామా చేయని వారిని అడుగడుగునా అడ్డుకుంటామని హెచ్చరించారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
13 జనవరి
2025






# శ్రీరాముడిగా.. వేంకటేశ్వరుడిగా యాదగిరీశుడు

## యాదగిరిగుట్టలో మూడో రోజుకు చేరిన అధ్యయనోత్సవాలు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో అధ్యయనోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా మూడో రోజైన ఆదివారం రామావతారంలో, వేంకటేశ్వరస్వామిగా నారసింహుడు భక్తులకు దర్శనమిచ్చారు. సన్నాయి వాయిద్యాలు, మేళ తాళాల హోరులో వేదపారాయణాలు, వేద మంత్రోచ్ఛారణల నడుమ శ్రీరాముడు, వేంకటేశ్వరస్వామి అలంకార సేవలను అర్చకులు వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూలవరులకు నిత్య కైంకర్యాలు నిర్వహించిన అనంతరం.. స్వామివారిని రామావతార అలంకారంలో అందంగా ముస్తాబు చేసి ప్రధానాలయ మాడవీధుల్లో ఊరేగించారు. వజ్ర వైఢూర్యాలు, బంగారు ఆభరణాలు ధరించిన నారసింహుడు.. లక్ష్మీసమేతుడై మాడవీధుల్లో వహరిస్తూ భక్తులను కనువిందు చేశారు. అలాగే సాయంత్రం నిత్యారాధనలు ముగిసిన అనంతరం.. వేంకటేశ్వరస్వామి అలంకారంలో స్వామివారిని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసి ఆలయ తిరువీధుల్లో విహరింపజేశారు. ఆలయ పురవీధుల్లో ఊరేగుతూ స్వామివారు భక్తులకు తరింపజేశారు. అనంతరం ప్రత్యేక వేదికపై స్వామివారిని అధిష్టింపజేసి వేంకటేశ్వరస్వామి అవతార విశిష్టతను భక్తులకు అర్చకులు ప్రవచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహమూర్తి, ఈవో భాస్కర్ రావు, డిప్యూటీ ఈవో దోర్బల భాస్కర్ శర్మ, ఆలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

**నేడు వెన్నకృష్ణుడు, కాళీయమర్ధనుడి అలంకార సేవలు**

అధ్యయనోత్సవాల్లో భాగంగా నాలుగో రోజైన సోమవారం ఉదయం వెన్నకృష్ణుడు, సాయంత్రం కాళీయమర్ధనుడి అలంకార సేవలు చేపట్టనున్నారు. నారసింహుడి అలంకార సేవలను ఆలయ మాడవీధుల్లో విహరింపజేసి భక్తులకు దర్శనం కల్పించనున్నారు.











ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక

సోమవారం
13 జనవరి
2025





## బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్యపై కేసు నమోదు

### కాంగ్రెస్ కార్యకర్తలను అసభ్య పదజాలంతో తిట్టినందుకు కేసు ఫైల్



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు కర్రె వెంకటయ్యపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఆదివారం కాంగ్రెస్ కార్యకర్తలను అసభ్య పదజాలంతో తిట్టినందుకు.. అతనిపై కేసు నమోదు చేసినట్లు యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపారు. ఆదివారం భువనగిరిలో బీఆర్ఎస్ మహాధర్నాకు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. పోలీసులు యాదగిరిగుట్ట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కర్రె వెంకటయ్య సహా పలువురిని ఉదయమే ఇంటికి వెళ్లి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చారు. ఆ సమయంలో ఆయన పీఎస్ ప్రాంగణంలోనే మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ కార్యకర్తలను బూతులు తిట్టారు. ఈ పరిణామాలు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల మధ్య శత్రుత్వం పెంచేలా ఉండడంతో.. కర్రె వెంకటయ్యపై కేసు నమోదు చేశామని పోలీసులు వెల్లడించారు.

## మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

### సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల



నకిరేకల్, రాజకీయంగా, సామాజికంగా అన్ని రంగాల్లో మహిళలు ముందుండాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యురాలు కందాల ప్రమీల, పార్టీ పట్టణ కార్యదర్శి వంటేపాక వెంకటేశ్వర్లు అన్నారు. 5వ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక పన్నాలగూడెం, 9, 10 వార్డులలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వస్తున్న తరుణంలో వారిలో ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం కోసమే ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వాలు హామీలు ఇచ్చి అమలు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. మహిళా సాధికారత అని గొప్పలు చెప్పుకోవడం తప్ప వారికి చేసింది ఏమీ లేదన్నారు. మహిళల హక్కులు హరిస్తున్నాయని, రోజు రోజుకు హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయని వాటిని అరికట్టడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. నిత్యవసర ధరలు ఆకాశాన్ని అంటుతున్నప్పటికీ కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర ప్రభుత్వ విధానాలు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షురాలు చెన్నబోయిన నాగమణి, పట్టణ అధ్యక్షురాలు పన్నాల శశికళ, రైతు సంఘం మహిళా జిల్లా కార్యదర్శి గింజల లక్ష్మి, రైతు సంఘం మహిళ కార్యదర్శి గురజ స్వరూప, మాజీ ఎంపీపీ సుంకి మనెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## సాయిబాబా మందిరంలో మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు



నకిరేకల్ : పట్టణంలోని శ్రీ షిర్డి సాయిబాబా సంస్థాన్ ట్రస్ట్ నకిరేకల్ వారి ఆధ్వర్యంలో శ్రీ ఐశ్వర్య సాయి మందిర ప్రాంగణంలో సంక్రాంతి పండగ పురస్కరించుకొని ముగ్గుల పోటీలు నిర్వహించారు న్యాయ నిర్ణేతలుగా డాక్టర్ సుశ్రుత, డాక్టర్ సుష్మా రెడ్డి, ఉపాధ్యాయులు శ్రీలత, అంబజా ముగ్గులను పరిశీలించారు. ప్రథమ పెండెం ధనుష, ద్వితీయ పి.సరిత , తృతీయ సిరిపురం లక్ష్మి కళ, చతుర్ధ జానకి, పంచమ మూడుదుడ్ల రాధలకు బహుమతులను ప్రకటించి ఎస్ ఎల్ ఎన్ వస్త్రాలయం గట్టు శ్యామ్ సుందర్, దేవగాంధారి షాపింగ్ మాల్ శోభరాణి సహకారంతో అందజేశారు. పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి ట్రస్ట్ వారు కన్సోలేషన్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ప్రదాన కార్యదర్శి యాట మధుసూదన్ రెడ్డి, కోశాధికారి ఉప్పల వెంకటరమణ,పోతుల రాములు, జోర్రీగల శ్రీనివాస్, బండారు వేణుగోపాల్,పిల్లల మర్రి సునీత శ్రీనివాస్, దుర్గి మురళీధర్ శర్మ, పాపాని చంద్రయ్య, కోట రామచొక్కం,మీలా సోమన్న పాల్గొన్నారు.

# హాస్టల్ నుండి పారిపోయిన విద్యార్థి తల్లిదండ్రుల చెంతకు..



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: హాస్టల్ నుంచి పారిపోయిన విద్యార్థి తల్లిదండ్రుల చెంతకు చేరిన ఘటన ఆదివారం యాదగిరిగుట్టలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నల్గొండ జిల్లా కేంద్రానికి చెందిన చిలుకల రాములు, రేణుక దంపతుల కుమారుడైన నాని.. నల్గొండ జిల్లా తిప్పర్తిలోని ఎస్సీ రెసిడెన్సియల్ లో 7వ తరగతి చదువుతూ హాస్టల్ లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో డిసెంబర్ 4న ఇంటి వద్దనున్న తన కుమారుడిని పేరెంట్స్ తీసుకెళ్ళి హాస్టల్లో వదిలి వెళ్లిపోయారు. అదే నెలలో డిసెంబర్ 6న హాస్టల్ నుంచి నేరుగా నల్గొండకు చేరుకున్నాడు. అదే సమయంలో మెదక్ జిల్లా గజ్వేల్ కు చెందిన తాపీమేస్త్రీ గణేష్ రేణుక అనే దంపతులకు తారసపడ్డాడు. దీంతో నానికి తీసుకొని రెండు రోజులు తిరువతికి వెళ్లి నేరుగా యాదగిరిగుట్ట పట్టణానికి చేరుకున్నారు. వారం రోజుల గడిచిన తర్వాత నాని తల్లిదండ్రులు డబ్బులు ఇవ్వడానికి హాస్టల్ కు వెళ్లగా.. కొడుకు నాని హాస్టల్ కు రాలేదని వార్డెన్ తెలిపారు. దీంతో వెంటనే స్థానిక తిప్పర్తి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. అప్పటి నుండి ఎక్కడ ఆరా తీసిన నాని జాడ దొరకలేదు. గత నెల రోజులుగా ముగ్గురు యాదగిరిగుట్ట దేవస్థానం అన్నదాన సత్రంలో భోజనం చేసి కొండపైన డార్మెటరీ హాల్ లో రాత్రివేళ బస చేస్తున్నారు. ఈ క్రమంలో విద్యార్థి నాని గణేష్, రేణుకతో ఉండలేక.. పట్టణంలో ఒక మహిళ సెల్ ఫోన్ నుండి తన తల్లికి ఫోన్ చేసి తాను యాదగిరిగుట్టలోని బీసీకాలనీలో ఉన్నానని తెలిపారు. దీంతో నాని తండ్రి యాదగిరిగుట్ట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో.. వెంటనే పోలీసులు వెళ్లి నానిని పీఎస్ కు తీసుకువచ్చారు. అనంతరం తల్లిదండ్రులకు కొడుకు నానిని అప్పగించారు. కాగా నానిని తమవెంట తిప్పుకున్న గణేష్, రేణుక దంపతులకు తిప్పర్తి పీఎస్ కు తరలించారు. తప్పిపోయిన తమ కొడుకు దొరకడంతో తల్లిదండ్రులు రాములు, రేణుక సంతోషానికి అవధులు లేకుండా పోయింది.

## ప్రముఖ కవి బెల్లి యాదయ్యకు అలిశెట్టి అవార్డు



నకిరేకల్, ప్రగతిశీల కవితా ప్రస్థానంలో అవిరళ కృషి చేస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డా. బెల్లి యాదయ్య అలిశెట్టి ప్రభాకర్ పురస్కారానికి వన్నెతెచ్చే వ్యక్తి అని ప్రెస్ అకాడమీ పూర్వ అధ్యక్షులు అల్లం నారాయణ అన్నారు. తెలంగాణ రచయితల వేదిక కరీంనగర్ పట్టణం ఫిలింభవన్ లో నిర్వహించిన అలిశెట్టి స్మారక రాష్ట్రస్థాయి పురస్కార సభలో ముఖ్య అతిథిగా అల్లం నారాయణ పాల్గొని ప్రసంగించారు. అతిథుల సమక్షంలో డా.బెల్లి యాదయ్యకు పురస్కార ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్సీ నారదాసు లక్ష్మణరావు, అలిశెట్టి పురస్కార కమిటీ సభ్యులు గాజోజు నాగభూషణం, కూకట్ల తిరుపతి, అన్నవరం దేవేందర్, బూర్ల వేంకటేశ్వర్లు, సి.వి.కుమార్, కందుకూరి అంజయ్య, ప్రజాగాయకులు చింతల యాదగిరి, పాటల వెంకన్న, విప్లవ్ కుమార్, విజయ్,జర్నలిస్టులు క్రాంతి, కంభాలపల్లి కృష్ణ, ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల సంఘం ప్రధాన కార్యదర్శి డా. కె. సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## పండుగ వేళ విషాదం, లారీ కింద పడి యువకుడి దుర్మరణం

ఖమ్మం: సంక్రాంతి పండుగకు సోదరిని వెంట తీసుకె ళ్దామని వస్తుండగా జరిగిన దుర్ఘ టన ఆ కుటుంబంలో విషాదాన్ని నింపింది. సోదరిని పండుగకు తీసుకెళ్లడానికి వస్తున్న ఓ యువ కుడు ప్రమాదవశాత్తు లారీ కింద పడి మృతి చెందాడు. ఖమ్మం టూటౌన్ సీఐ బాలకృష్ణ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. టేకులపల్లి మండలం బేతంపూడి వెంకటాయతం డాకు చెందిన బోడా వాత్యా కుమారుడు శ్రీనివాస్(20) డిప్లొమా చదువుతున్నాడు. ఆన సోదరి శ్రావ్య ఖమ్మంలో చదువుకుంటుండగా సంక్రాంతి సెలవుల్లో తీసుకెళ్దామని ద్విచక్రవాహనంపై వచ్చాడు. ఈలోగా తన స్నేహితురాలు కలవడంతో ఆమెను బైక్పై ఎక్కించుకుని బయలుదేరాడు. ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ వద్దకు చేరుకోగానే ఓ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడుపుతూ పక్కనుంచి వేగంగా పోనిచ్చాడు. ఈక్రమంలో లారీ శ్రీనివాస్ బైక్ను తాకడంతో అదుపు తప్పగా శ్రీనివాస్, ఆయన స్నేహితురాలు కిందపడ్డారు. ఆ సమయాన శ్రీనివాస్ లారీ చక్రాల కింద పడడంతో నలిగిపోయి అక్కడిక్కడే మృతిచెందాడు. ఈ ఘటనలో ఆయన స్నేహితురాలికి గాయాలు కాగా ఆస్పత్రికి తరలించారు. తనను పండుగకు తీసుకెళ్తామని వచ్చిన సోదరుడు మృతి చెందిన సమాచారం తెలుసుకుని వచ్చిన శ్రావ్య, తల్లిదండ్రులు వాత్యా - భాగ్యలక్ష్మి గుండెలవిసేలా రోదించారు.

## మంత్రి కోమటిరెడ్డిని కలిసిన దైద రవీందర్



**నకిరేకల్ :** తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యలను ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు దైద రవీందర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో సన్మానించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

## మంత్రిని కలిసిన గాజుల సుకన్య శ్రీనివాస్



**నకిరేకల్ :** తెలంగాణ మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలుగా నియమితులైన సందర్భంగా నల్లగొండ పట్టణానికి విచ్చేసిన రోడ్డు భవనాల మరియు సినిమాటోగ్రఫీ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ని నకిరేకల్ మున్సిపాలిటీ నాలుగో వార్డ్ కౌన్సిలర్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు గాజుల సుకన్య శ్రీనివాస్. మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా మంత్రివర్యులు వారిని అభినందించారు.

## బిజెపి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి

నకిరేకల్, :స్వామి వివేకానంద 163వ జయంతిని నకిరేకల్ మెయిన్ సెంటర్ లో భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు బుడిగే సైదులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మండల వెంకన్న, కిసాన్ మోర్చ ప్రధాన కార్యదర్శి గుడుగుంట్ల సాయన్న, జిల్లా నాయకులు యానాల శ్రీనివాసరెడ్డి, జిల్లా డాకయ్య, పుట్ట వెంకన్న , తాటికొండ రామ్మూర్తి , గర్రె మురళీమోహన్, కొల్లు శివ శంకర్, ఉప్పల నాగరాజు, సామ విక్రంరెడ్డి, వేముల విజయ్, దేవేందర్, శంకర్ పుట్ట సైదులు పాల్గొన్నారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
13 జనవరి
2025





# పండక్కి పూరేలాల్సిందే..




## మూడు రోజుల్లో ఏపీ వైపునకు 60 వేలకు పైగా బైక్‌లు

## బస్సులు, రైళ్లలో చార్జీల మోత..

## తాళలేక బైక్‌లపై సొంతూళ్లకు

## కార్లలోనూ పలువురి ప్రయాణం..

## టోల్‌గేట్ల వద్ద బారులు

## సంక్రాంతి ప్రభావంతో హైదరాబాద్ రహదారులు ఖాళీ

ఎలాగైనా పండగకి ఇంటికి వెళ్లాలి.. కుటుంబంతో కలిసి ఎంజాయ్ చెయ్యాలి.. సొంతూరిని వదిలి ఇతర ప్రాంతాల్లో ఉపాధి పొందుతున్న వారి ఆలోచన ఇది. దీనిని వ్యాపార వస్తువుగా మార్చుకున్న రవాణా సంస్థలు ప్రత్యేక సర్వీసుల పేరిట చార్జీల మోత మోగిస్తున్నాయి. ఆర్టీసీ, ప్రైవేటు ట్రావెల్స్, రైళ్లు అన్నింటిలోనూ ఈ ప్రత్యేక బాదుడు ఉంది. సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడకు బస్సును బట్టి సుమారు రూ.500 నుంచి ప్రారంభమయ్యే టికెట్ ధర.. ఈ పండగ సీజన్‌లో వేలకు చేరింది. ప్రైవేట్ ట్రావెల్స్ అయితే టికెట్ ధరలను మూడింతల దాకా పెంచేశాయి. ఈ ధరలను భరించలేక కొందరు తమ ప్రయాణాలు వాయిదాలు వేసుకుంటే.. మరికొందరు ఎలాగైనా సరే సొంతూరికి వెళ్లాలని ప్రత్యామ్నాయాలు అన్వేషిస్తున్నారు. ఎలాగైనా పండగకు ఇంటికి వస్తామంటూ.. కార్లు ఉన్న వారు తమ వాహనాల్లోనే ప్రయాణమవుతుంటే మరికొందరు ద్విచక్రవాహనాలపై వెళ్లిపోతున్నారు. దూరం, ప్రమాదాన్ని లెక్క చేయకుండా బైక్‌పై రోడ్డు ఎక్కేస్తున్నారు.

హైదరాబాద్ నుంచి రాష్ట్రంలోని స్వగ్రామాలకే కాక.. ఏపీలోని విజయవాడ, గుంటూరు పరిసర ప్రాంతాలకు ద్విచక్రవాహనాలపై వెళుతున్న వారు వేలల్లో ఉంటున్నారు. గత మూడు రోజుల్లో 60 వేలకు పైగా ద్విచక్రవాహనాలు ఏపీ వైపు వెళ్లాయని హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారిలోని కొర్లపహాడ్ టోల్‌గేట్ సిబ్బంది తెలిపారు. కార్లు ఉన్న వారు తమ వాహనంలో దూర ప్రయాణాలు చెయ్యడం సహజమే కానీ బైక్‌లపై ఇలా దూరప్రయాణాలు చేసే వారి సంఖ్య పెరగడం గమనార్హం. ఇలా, హైదరాబాద్ నుంచి విజయవాడకు బైక్‌పై వె ళుతున్న ఓ వ్యక్తిని ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని కొమరబండ వైజంక్షన్ వద్ద ఆదివారం ఉదయం ఓ కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ద్విచక్రవాహనదారుడు స్వల్ప గా యాలతో బయటపడ్డాడు. మొత్తంగా గత మూడు రోజుల్లో రెండు లక్షలకు పైగా వాహనాలు ఏపీ వైపు వెళ్లాయని టోల్‌గేట్‌ల సిబ్బంది చెబుతున్నారు. హైదరాబాద్– విజయవాడ మార్గంతోపాటు రాష్ట్రంలోని ముఖ్య పట్టణాలను చేరుకునే ర హదారులు పండగ ప్రయాణాలతో కిటకిటలాడుతున్నాయి. హైదరాబాద్– వరంగల్ జాతీయ రహదారిలో మూడు రోజులుగా కొనసాగుతున్న రద్దీ ఆదివారం సాయంత్రానికి సాధారణ స్థితికి చేరింది.

### హైదరాబాద్ ట్రాఫిక్‌కు బ్రేక్

ప్రతి నిత్యం ప్రజల ఉరుకులు, పరుగులతో బిజీబిజీగా ఉండే హైదరాబాద్ నగరానికి చిన్న విరామం దొరికింది. సంక్రాంతి పండగను కుటుంబసభ్యులతో జరుపుకోవాలని పెద్దసంఖ్యలో నగరవాసులు శుక్రవారం సాయంత్రం నుంచి సొంతూళ్ల బాటపట్టారు. దీంతో రాష్ట్ర రాజధాని మూడు రోజులుగా ఖాళీ అవుతోంది. వెరసి ట్రాఫి క్ టెన్షన్ నుంచి హైదరాబాదీలకు కాసింత ఉపశమనం లభించింది. కొన్ని రహదారులైతే నిర్మానుష్యంగా మారాయి.

### మొదలైన ఐనవోలు మల్లన్న జాతర

జానపదుల జాతరగా పేరొందిన హనుమకొండ జిల్లా ఐనవోలు మల్లికార్జునస్వామి జాతర ప్రారంభమైంది. మకర సంక్రమణంతో ప్రారంభమై ఉగాది వరకు జాతర జరుగనుంది. భోగి, సంక్రాంతి రోజుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు జాతరకు తరలివస్తారు.

### సీఎం రేవంత్ సంక్రాంతి శుభాకాంక్షలు

సంక్రాంతిని పురస్కరించుకుని సీఎం రేవంత్ రెడ్డి తెలుగు ప్రజలందరికీ ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. భోగి, సంక్రాంతి, కనుమ పండుగలను ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోని దాదాపు కోటిమంది రైతులు, నిరుపేదలు, వ్యవసాయకూలీల కుటుంబాల్లో ఈ సంక్రాంతి కొత్తవెలుగులు తెస్తుందన్నారు.

### నేటి నుంచి కైట్, స్వీట్ ఫెస్టివల్

సంక్రాంతి సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో మూడు రోజులు పాటు జరిగే ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్ సోమవారం సాయంత్రం ప్రారంభం కానుంది. రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఈ కార్యక్రమాలను ప్రారంభిస్తారు.

# మందా జగన్నాథం కన్నుమూత

## అనారోగ్యంతో కొద్దిరోజుల క్రితం నిమ్స్ ఆస్పత్రికి

## 22 రోజులుగా కొనసాగిన చికిత్స

## ఆదివారం సాయంత్రం గుండెపోటుతో మృతి

## నాలుగుసార్లు నాగర్‌కర్నూల్ ఎంపీగా సేవలు

## ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధిగా బాధ్యతలు

## సీఎం రేవంత్, చంద్రబాబు, కేసీఆర్ సంతాపం

హైదరాబాద్ : నాగర్‌కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం(73) కన్నుమూశారు. 22 రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయనకు ఆదివారం సాయం త్రం గుండెపోటు రావడంతో డాక్టర్లు అత్యవసర చికిత్స అందించారు. అయినా ఆరోగ్య పరిస్థితి మెరుగపడలేదు. రాత్రి 7.40 గంటలకు పరిస్థితి విషమించి జగన్నాథం కన్నుమూశారు. గత నెల 22న ఆయన గుండె, మూత్ర పిండాలు, ఊపిరితిత్తుల సమస్యలతో నిమ్స్‌లో చేరారు. మధుమేహం, అధిక రక్తపోటు సమస్యలతో పాటు హృదయ ధమనుల్లో రక్త ప్రవాహం సాఫీగా సాగేందుకు డాక్టర్లు ఆయనకు చికిత్సలు అందించారు. కొద్ది రోజుల క్రితం ఆయన ఆరోగ్యం కాస్త మెరుగుపడినా.. మళ్లీ ఆందోళకర పరిస్థితి నెలకొంది.

**టీడీపీ నుంచి ప్రస్థానం..**

మహబూబ్‌నగర్ జిల్లా అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లి మండలం కొండేరులో మందా జగన్నాథం జన్మించారు. డాక్టర్‌గా పనిచేసిన ఆయన ఎన్టీఆర్ పిలుపుతో 1996లో టీడీపీలో చేరారు. వరుసగా 4సార్లు నాగర్‌కర్నూల్ ఎంపీగా సేవలందించారు. 1996, 1999 2004లో టీడీపీ నుంచి.. 2009లో కాంగ్రెస్ నుంచి ఎంపీగా గెలిచారు. ఒకసారి ఢిల్లీలో ఏపీ ప్రభుత్వ ప్రతినిధిగా కొనసాగారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఆయన ఆ తర్వాత టీఆర్‌ఎస్ కు దగ్గరయ్యారు. 2014లో టీఆర్‌ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఢిల్లీలో ప్రత్యేక ప్రతినిధిగా హోదా దక్కినా క్రియాశీల రాజకీయాలకు దూరంగా ఉన్నారు. గతంలో గుండెకు సంబంధించి బైపాస్ సర్జరీ చేయించుకున్నారు.

**జగన్నాథం సేవలు మరువలేనివి: రేవంత్**

నాగర్‌కర్నూల్ ఎంపీగా, సామాజిక, తెలంగాణ ఉద్యమకారుడిగా మందా జగన్నాథం సేవలు మరువలేనివని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. జగన్నాథం మృతిపట్ల సంతాపం తెలిపిన సీఎం.. ఆయన కుటుం బ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ప్రత్యేక తెలంగాణ ఏర్పాటులో క్రియాశీల పాత్ర పోషించారని, ఆయన మృతి తెలంగాణకు తీరని లోటు అని రేవంత్‌రెడ్డి అన్నారు. మంత్రులు దామోదర రాజనరసింహ, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, సీతక్క, కొండా సురేఖ, ఎంపీ మల్లు రవి, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, జానారెడ్డి, కె.కేశవరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ తదితర నేతలు జగన్నాథం మృతి పట్ల సంతాపం తెలిపారు. పేద కుటుంబం నుంచి వచ్చిన జగన్నాథం ఉన్నత చదవులు చదివి టీడీపీ తరఫున 3సార్లు ఎంపీగా గెలిచి, ప్రజాసేవ చేశారని ఏపీ సీఎం చంద్రబాబు కొనియాడారు. జగన్నాథం మృతి పట్ల సంతాపం తెలిపారు. తెలంగాణ సీనియర్ రాజకీయవేత్తను కోల్పోయిందని మాజీ సీఎం కేసీఆర్ విచారం వ్యక్తం చేశారు. జగన్నాథం మృతి బాధాకరమని బీఆర్‌ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్‌రావు, కవిత పేర్కొన్నారు.

# భరోసా మోసంపై చర్చకు సిద్ధమా?



మొదటి పేజీ తరువాయి

అయినా నెరవేర్చారా అని నిలదీశారు. కాంగ్రెస్ నేతలు అందరినీ మోసం చేశారని, ఈ అంశంపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాలు విసిరారు.

సిద్దిపేట క్యాంపు కార్యాలయంలో ఆదివారం మీడియా సమావేశంలో హరీశ్‌రావు మాట్లాడుతూ రైతుభరోసా హామీ మేరకు రూ.15 వేలు ఇవ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసగించిందని, వానకాలం రైతుభరోసాకు గుండుసున్నా పెట్టిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ నాయకులు ఊర్లలోకి వస్తే ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాల్సిందే అని రైతులు నిలదీయాలని సూచించారు. బీఆర్‌ఎస్ హయాంలో 3 పంటలకు రైతుబంధు ఇవ్వాలన్న రేవంత్‌రెడ్డి ఇప్పుడు ఒక పంటకు కూడా సరిగా ఇవ్వడంలేదని ఎద్దేవా చేశారు. కౌలు రైతులకు రైతుభరోసా ఎందుకు ఇవ్వడంలేదని ప్రశ్నించారు.

ఎన్నికల ముందు నోరు పెంచి ఏటా ఎకరాకు రూ.15 వేలు ఇస్తానని చెప్పి, ఇప్పుడు ఏటా రూ.12 వేలు మాత్రమే ఇస్తామనడం సిగ్గుచేటని నిప్పులుచెరిగారు. కోటి మంది ఉ పాధి హామీ కూలీలు ఉంటే కేవలం పది లక్షల మంది రైతు కూలీలకు మాత్రమే రూ.12 వేల చొప్పున ఇస్తామని అంటున్నారని తెలిపారు. 90 లక్షల మందికి పథకాన్ని ఎగ్గొట్టారని విమర్శించారు. వ్యవసాయ కూలీలందరికీ పథకం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. పథకంలో ప్రతిపాదనలు చేసేటప్పుడు పాలకులకు కనీస సోయి లేకుండా పోయిందని నిప్పులుచెరిగారు. మెడమీద తలకాయ ఉన్నోళ్లు ఇలా చేస్తారా అని ప్రశ్నించారు.

**ఒట్లు పెట్టి.. పథకాలు ఎగ్గొట్టి!**

కనపడ్డ దేవుళ్లందరి మీద ఒట్టు పెట్టి రైతు రుణమాఫీ చేస్తానన్న రేవంత్‌రెడ్డి ఏడాది గడిచినా ఇంతవరకు పూర్తిగా చేయలేదని మండిపడ్డారు. రేవంత్‌రెడ్డి బుకాయించకుండా ఇచ్చిన మాట ప్రకారం రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ప్రశ్నించిన వారిని గూండాలతో కొట్టించుడో, చిల్లరగాళ్లతో తిట్టించుడో మానుకోవాలని హితవు పలికారు. ఈ సందర్భంగా రుణమాఫీ కాని కొందరు రైతులు వివరాలను ఆధారాలతో సహా హరీశ్‌రావు మీడియాకు చూపించారు. రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో చెప్పిన మాటలు కూడా తప్పుతున్నారని, పది పంటలకు బీమా అని చెప్పి ఒక పంటకే ఇచ్చారని గుర్తుచేశారు. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన ప్రధానమైన 5 హామీలు రైతుభరోసా రూ.15వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12వేలు, పంటలబీమా, అన్ని పంటలకు బోనస్, కౌలు రైతులకు రైతుభరోసా అమలు చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# తెలుగు ప్రజలకు సంక్రాంతి ఎంతో ప్రత్యేకం


### ఇది రైతుల పండుగ: వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ, జనవరి 12 : తెలుగు ప్రజలకు సంక్రాంతి పండుగ ఎంతో ప్రత్యేకమైనదని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఇది రైతుల పండుగ అని, తాను కూడా రైతు బిడ్డనేనని, అందుకే ఈ పండుగకు అధిక ప్రాధాన్యం ఇస్తానని చెప్పారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లోని ఓ వ్యవసాయ క్షేత్రంలో స్వర్ణభారత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. వేడుకల్లో వెంకయ్యనాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తెలుగుభాష ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పాలని పిలుపునిచ్చారు.

పాశ్చాత్య జీవనాన్ని అనుకరించడం మాని భారతీయ జీవన విధానాన్ని ఆచరించాలన్నారు. రఘోత్తంరెడ్డి రచించిన సంప్రదాయ జీవన విధానాన్ని ప్రతిబింబించే రెండు పుస్తకాలను వెంకయ్యనాయుడు ఈ సందర్భంగా ఆవిష్కరించారు. వివేకానందుడి జయంతి సందర్భంగా నివాళి అర్పించారు. ఈ వేడుకల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఈటల రాజేందర్, మాజీ ఎంపీ కేవీపీ పాల్గొన్నారు. కాగా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో సోమవారం నిర్వహించనున్న సంక్రాంతి ఉత్సవాలకు ప్రధాని మోదీ హాజరుకానున్నారు.

# ‘భూ భారతి’ భూములకే భరోసా



## సాగు యోగ్యమైతేనే పెట్టుబడి సాయం

## రైతు భరోసా మార్గదర్శకాలు విడుదల

హైదరాబాద్, జనవరి 12 : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న రైతుభరోసా పథకానికి సంబంధించి మార్గదర్శకాలను విడుదల చేసింది. దీనిని ఈ నెల 26 నుంచి అమలు చేయాలని నిర్ణయించిన నేపథ్యంలో.. పథకానికి ఎవరు అర్హులు, ఎలా అమలు చేయనున్నామనే వివరాలు తెలుపుతూ ఉత్తర్వులు జారీ చేసింది. భూ భారతి (ధరణి) పోర్టల్‌లో నమోదై ఉండి, వ్యవసాయ యోగ్యమైన భూమికి.. దాని విస్తీర్ణం ఆధారం గా పట్టాదారులకు పెట్టుబడి సాయం అందించాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఆర్వోఎఫఆర్ పట్టాదారులకూ సాయం అందించనుంది. ఎకరానికి ఏటా రూ.12 వేల (సీజన్‌కు రూ.6 వేల) చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయనుంది.

సాగుకు యోగ్యంకాని భూములు ఉంటే వాటిని ‘రైతు భరోసా’ జాబితా నుంచి తొలగించాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం తెలిపింది. కాగా, సాంకేతికంగా ఈ పథకం అమలు బాధ్యతలను నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్‌ఐసీ) నిర్వహించనుంది. ఏవైనా ఫిర్యాదులు వస్తే వాటి పరిష్కారానికి జిల్లాల కలెక్టర్లు బాధ్యులుగా ఉ ంటారని మార్గదర్శకాల్లో పేర్కొన్నారు. మొత్తం ప్రక్రియను వ్యవసాయ శాఖ పర్యవేక్షించనుంది. రాష్ట్రంలో వ్యవసాయాన్ని లాభసాటిగా చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందులో భాగంగానే రైతులకు పంట పెట్టుబడి సాయాన్ని అందించను న్నామని ఉత్తర్వులో తెలిపింది. దీని ద్వారా వ్యవసాయ ఉత్పాదకతను పెంచడం, రైతుకు ఆర్థిక స్థిరత్వాన్ని కల్పించడంతోపాటు వ్యవసాయంలో ఆధునిక పద్ధతుల ను అవలంబించేందుకు వీలు కల్పించవచ్చని పేర్కొంది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
13 జనవరి
2025








## కొనసాగుతున్న ఎఫ్‌పీఐల విక్రయాలు..

### జనవరిలో 22,194 కోట్లు వెనక్కి

దేశీయ ఈక్విటీ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్ల విక్రయాల పర్వం కొనసాగుతూనే ఉంది. అమెరికా డాలర్ పెరుగుదల, టారిఫ్‌లపై ఆందోళన నేపథ్యంలో ఎఫ్‌పీఐలు పెద్ద ఎత్తున నిధులను దేశీయ మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్నారు. జనవరిలో విక్రయాలే భారీగా జరిగినట్లు గణంకాలు చెబుతున్నాయి. జనవరి 10 నాటికి ఎఫ్‌పీఓలు దేశీయ ఈక్విటీల నుంచి రూ.22,194 కోట్లను ఉపసంహరించుకున్నారు. అమెరికా అధ్యక్షుడిగా విజయం సాధించిన డొనాల్డ్ ట్రంప్ జనవరి 20న అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఆయన సుంకాలపై తీసుకొనే నిర్ణయాలపై ఆందోళన నెలకొంది. జీడీపీ వృద్ధిలో మందగమనం, అధిక ద్రవ్యోల్బణం, అనిశ్చితి వంటి అనేక అంశాలు కూడా నిధులు తరలిపోవడానికి ఓ కారణంగా నిపుణులు చెబుతున్నారు. రుపాయి విలువ రికార్డు స్థాయి కనిష్ఠానికి చేరడం, అమెరికన్ డాలర్ రోజురోజుకూ బలపడుతుండడం, బాండ్ల రాబడి పెరగడంతో మన ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ మదుపర్ల అమ్మకాలు కొనసాగుతున్నాయి. దీంతో జనవరి 10 నాటికి దేశీయ ఈక్విటీ నుంచి రూ.22,194 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. జనవరి 2 మినహా అన్ని ట్రేడింగ్ రోజుల్లో ఎఫ్‌పీఐలు విక్రయదారులుగానే నిలిచారు.




## 2025లో రూ.3 లక్షల కోట్ల ఐపీఓలు!

ముంబయి: ఈ ఏడాది ఐపీఓల ద్వారా కంపెనీలు 35 బిలియన్ డాలర్ల (రూ.3 లక్షల కోట్ల) మేర సమీకరించే అవకాశం ఉందని కోటక్ క్యాపిటల్ అంచనా వేసింది. 2024లో కంపెనీలు సమీకరించిన 22 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.1.8 లక్షల కోట్ల)తో పోలిస్తే ఇది గణనీయ వృద్ధి అని తెలిపింది. 2025లో ఆర్థిక సేవల రంగం నుంచి అత్యధికంగా 9 బిలియన్ డాలర్ల (రూ.76,500 కోట్ల) విలువైన ఐపీఓలు రానున్నాయి. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్, అవాన్సే ఫైనాన్షియల్ సర్వీసెస్, టాటా క్యాపిటల్ వంటి కంపెనీలు ఇందులో ఉన్నాయి. ఈకామ్ ఎక్స్‌ప్రెస్, జెప్టో, పెప్పర్‌ఫ్రై వంటివి 5 బిలియన్ డాలర్ల (రూ.42,500 కోట్ల)ను సమీకరించనున్నాయి. కంపెనీల ఐపీఓ పరిమాణాలు స్థిరంగా పెరుగుతున్నాయని, భవిష్యత్తు పెట్టుబడుల కోసం పబ్లిక్ ఇష్యూకు వెళ్లాలని చూసే కంపెనీల సంఖ్య పెరుగుతోందని కోటక్ క్యాపిటల్ తెలిపింది. 2024లో వచ్చిన 91 ఐపీఓల సగటు లిస్టింగ్ లాభాలు 32.8 శాతంగా ఉన్నట్లు వెల్లడించింది. విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు కూడా తమ పెట్టుబడుల కోసం ఐపీఓలపై ఆధారపడుతున్నారని, సెకండరీ మార్కెట్ కంటే దీనివైపే చూస్తున్నారని తెలిపింది. ఐపీఓకు ముందు లక్ష్మీ డెంటల్ యాంకర్ మదుపర్ల నుంచి రూ.314 కోట్ల నిధుల్ని సమీకరించింది. 31 సంస్థలకు ఒక్కో షేరు రూ.428 చొప్పున మొత్తం 73.39 లక్షల షేర్లను కేటాయించడం ద్వారా రూ.314.12 కోట్లను సమీకరించింది. ఐపీఓ 13-15 తేదీల్లో ఉండనుంది. ధరల శ్రేణి రూ.407-428. తాజా ఈక్విటీ షేర్ల జారీ ద్వారా రూ.138 కోట్లు సమీకరించనుంది. ఆఫర్ ఫర్ సేల్(ఓఎఫ్ఎస్)లో ప్రమోటర్లకు చెందిన 1.31 కోట్ల వరకు షేర్లు విక్రయించడం ద్వారా రూ.560 కోట్లు సేకరించనుంది.

## జీఎస్‌టీని 1 శాతానికి తగ్గించాలి

- రత్నాభరణాల పరిశ్రమ వినతి
- 'బడ్జెట్ 2025-26 విన్నపాలు'




వ్యయ భారం తగ్గాలంటే రాబోయే బడ్జెట్‌లో జీఎస్‌టీని 1 శాతానికి తగ్గించాలని రత్నాభరణాల పరిశ్రమ కోరుతోంది. 'పన్నుల హేతుబద్ధీకరణ, వ్యాపారానికి సహకారం అందించేందుకు రుణాల లభ్యత పెంచాలని మేం అడిగామ'ని అఖిల భారత రత్నాభరణాల మండలి (జీజేసీ) ఛైర్మన్ రాజేశ్ రోక్డే తెలిపారు. పసిడి ధరలు బాగా పెరుగుతున్నందున, ప్రస్తుత జీఎస్‌టీ రేటు వల్ల పరిశ్రమ, వినియోగదార్లపై భారం అధికమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. రాబోయే బడ్జెట్లో ఈ రంగంపై జీఎస్‌టీని ప్రస్తుత 3% నుంచి 1 శాతానికి తగ్గించాలని తాము ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు. నిబంధనల పాటింపును ప్రోత్సహించేందుకూ ఇది ఉపకరిస్తుందని అన్నారు. పన్ను రేటు తగ్గింపు వల్ల గ్రామీణ ప్రాంతాల్లో అధికారిక కొనుగోళ్లు పెరుగుతాయనే అభిప్రాయాన్ని రోక్డే వ్యక్తం చేశారు. ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన వజ్రాలపైనా జీఎస్‌టీ రేట్లను తగ్గించాలని కోరారు. ప్రస్తుతం సహజసిద్ధంగా దొరికే వజ్రాలకు, ప్రయోగశాలల్లో అభివృద్ధి చేసిన వజ్రాలకు ఒకటే జీఎస్‌టీ రేటు వర్తిస్తోంది. ఆభరణాల రంగం కోసం ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను కేటాయించాలని, రాష్ట్రాలవారీగా నోడల్ అధికారులను నియమించాలని జీజేసీ కోరింది. ఆభరణాల కొనుగోలుకు ఈఎంఐ అంశాన్ని పరిశీలించాలని కూడా కోరినట్లు జీజేసీ వైస్ ఛైర్మన్ అవినాశ్ గుప్తా తెలిపారు.

# ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలకు 'ద్రవ్యోల్బణ సెగలు'

### మూడో త్రైమాసికంలో అమ్మకాలపై ప్రభావం




ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలు ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఎదుర్కొంటున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో (అక్టోబరు-డిసెంబరు) త్రైమాసికంలో ద్రవ్యోల్బణం, అధిక ఉత్పత్తి వ్యయాలు, ధరల చర్యలతో స్థూల మార్జిన్ తగ్గుతుందని, నిర్వహణ లాభం స్తబ్దుగా నమోదుకావొచ్చని కంపెనీలు అంచనా వేస్తున్నాయి. ఆదాయంలో కూడా ఒక అంకె వృద్ధి మాత్రమే ఉండొచ్చని, విలువ ఆధారిత వృద్ధికి మళ్లీ వెళ్లే అవకాశం ఉందని పలు సంస్థలు భావిస్తున్నాయి. డిసెంబరు త్రైమాసికంలో ఎక్కువ సంఖ్యలో కంపెనీలు ధరల పెంపునకు మొగ్గుచూపాయి. కోప్రా (ఎండు కొబ్బరి), వంటనూనె, పామాయిల్ ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణం. అధిక ఆహార ద్రవ్యోల్బణం వల్ల వినియోగం తగ్గి పట్టణ విపణి ఇబ్బందులు పడుతున్న సమయంలోనే ఈ ధరల పెంపులు వచ్చాయి. మొత్తం ఎఫ్ఎమ్‌సీజీ మార్కెట్‌లో మూడింట ఒకవంతు వాటా కలిగిన గ్రామీణ విపణి మాత్రం కొంచెం మెరుగ్గానే ఉంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో వ్యాపార ధోరణులకు సంబంధించిన సమాచారాన్ని డాబర్, మారికో వంటి నమోదిత ఎఫ్ఎమ్‌సీజీ కంపెనీలు వెల్లడించాయి. వీటి అమ్మకాల వృద్ధి స్తబ్దుగా లేదా 1-5 శాతంగా ఉండొచ్చని విశ్లేషకులు చెబుతున్నారు. డిసెంబరు త్రైమాసికంలో ఒక అంకె ఆదాయ వృద్ధి, నిర్వహణ లాభం స్తబ్దుగా ఉంటుందని డాబర్ అంచనా వేస్తోంది. కొన్ని విభాగాల్లో ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఉన్నాయని, ధరల నియంత్రణ చర్యలతో కొంత ప్రభావాన్ని తగ్గించినట్లు తెలిపింది. గ్రామీణ వినియోగం బలంగా ఉందని, పట్టణ ప్రాంతాలతో పోలిస్తే వేగంగా వృద్ధి చెందుతున్నట్లు వివరించింది. ఇ-కామర్స్, క్విక్ కామర్స్ సంస్థలు బలమైన వృద్ధిని నమోదు చేయడం కొనసాగించాయని, సాధారణ కిరాణా దుకాణాలు ఒత్తిడిలోనే ఉన్నట్లు పేర్కొంది. చ్యవన్‌ప్రాశ్, హనీ, పుదిన్ హరా, లాల్ తైల్, ఆమ్లా, రెడ్ పేస్ట్, రియల్, వాటికా వంటి ఉత్పత్తులను కంపెనీ విక్రయిస్తోంది. మారికో కూడా ఇదే విధమైన అంచనాలను వెల్లడించింది. గ్రామీణ వినియోగం మెరుగుపడుతుండటం, పట్టణాల్లో సెంటిమెంట్ స్థిరంగా ఉండటంతో డిసెంబరు త్రైమాసికంలో మంచి గిరాకీ ధోరణులు కనిపించాయి. సెప్టెంబరు త్రైమాసికంతో పోలిస్తే గత త్రైమాసికంలో అమ్మకాల వృద్ధి నమోదు కావొచ్చని, అధిక ఉత్పత్తి వ్యయాలతో నిర్వహణ లాభం మాత్రం మోస్తరుగా ఉండొచ్చని తెలిపింది. ద్రవ్యోల్బణం ప్రభావంతో అంచనాల కంటే అధికంగా స్థూల మార్జిన్ తగ్గొచ్చని వివరించింది. ఎండు కొబ్బరి, వంటనూనె ధరలు పెరగడం ఇందుకు తోడైనట్లు పేర్కొంది. సఫోలా, పారాచూట్, హెయిర్ అండ్ కేర్, నిహార్, లివాన్ వంటి బ్రాండ్‌లను మారికో విక్రయిస్తోంది.

#### బ్రోకరేజీ సంస్థలు ఏమంటున్నాయంటే..

ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, తక్కువ వేతన వృద్ధి, అధిక ఇళ్ల అద్దెల వల్ల పట్టణ గిరాకీ పరిస్థితులు సవాళ్లమయంగా ఉన్నట్లు నువామా తెలిపింది. మరో 2-3 త్రైమాసికాల పాటు పట్టణ మందగమనం కొనసాగొచ్చని అంచనా వేసింది. గ్రామీణ గిరాకీ నెమ్మదిగా పుంజుకోవడం కొనసాగొచ్చని, ఉచిత పథకాలు, మంచి వర్షపాతం వల్ల పట్టణ గిరాకీని అధిగమించొచ్చని అభిప్రాయపడింది. సబ్బులు, స్నాక్స్ వంటి విభాగాల్లో ధరల పెంపు వల్ల వినియోగదారులు చిన్న పరిమాణం కలిగిన ప్యాక్‌లకు మొగ్గుచూపుతున్నారని, ఫలితంగా అమ్మకాలపై ప్రతికూల ప్రభావం పడుతున్నట్లు వివరించింది. పామాయిల్, టీ ధరలు పెరగడం వల్ల సబ్బులు, స్నాక్స్, టీ విభాగాల్లో మార్జిన్‌లు అధిక ఒత్తిడిలో ఉన్నాయని తెలిపింది. డిసెంబరు త్రైమాసికంలో చలికాలం ఆలస్యంగా ప్రారంభం కావడం వల్ల బాడీ లోషన్, చ్యవన్‌ప్రాశ్ వంటి ఉత్పత్తుల అమ్మకాలపై ప్రభావం పడిందని, ఇది మళ్లీ పుంజుకోకపోవచ్చని వెల్లడించింది.




## అల్పాదాయ వర్గాలకు ఆదాయపు పన్ను తగ్గించాలి

- ఈవై ఇండియా సూచన
- 'బడ్జెట్ 2025-26 విన్నపాలు'

ప్రైవేటు మూలధన వ్యయాలను ప్రోత్సహించడం, పన్నుల సరళీకరణ, తక్కువ ఆదాయ వర్గాలకు వ్యక్తిగత ఆదాయపు పన్ను తగ్గింపు వంటి వాటిపై కొత్త బడ్జెట్‌లో దృష్టి సారించాలని ఈవై ఇండియా సూచించింది. దేశీయంగా గిరాకీని ఉత్తేజపర్చడానికి ఈ చర్యలు దోహదం చేస్తాయని పేర్కొంది. 2025-26 కేంద్ర బడ్జెట్‌ను వచ్చే నెల 1న ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనున్నారు. ఈ నేపథ్యంలో ఈవై ఇండియా తన అభిప్రాయాన్ని తెలిపింది. 2023-24లో రూ.31 లక్షల కోట్ల మేర ఆదాయపు పన్ను వివాదాలు ఏర్పడ్డాయి. వీటిని కమిషనర్ ఆఫ్ ఇన్‌కమ్‌ట్యాక్స్ (అప్పీల్స్) త్వరగా పరిష్కరించాల్సిన అవసరం ఉంది. అడ్వాన్స్ ప్రైసింగ్ ఒప్పందాలు, సేఫ్ హార్బర్స్ వంటి ప్రత్యామ్నాయ వివాద పరిష్కార యంత్రాంగాన్ని తీసుకురావాలి. 'ప్రత్యక్ష పన్ను కోడ్ సమగ్ర సమీక్షకు చాలా సమయం పట్టే అవకాశం ఉన్నందున, ప్రస్తుత బడ్జెట్‌లో కొన్ని ప్రారంభ చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా అల్పాదాయ వర్గాలకు వ్యక్తిగత ఆదాయపు పన్ను తగ్గించడం ద్వారా వారికి ఉపశమనం కలిగించి, గిరాకీని ఉత్తేజపర్చాల'ని ఈవై ఇండియా నేషనల్ ట్యాక్స్ లీడర సమీర్ గుప్తా అభిప్రాయపడ్డారు. స్థిరమైన వృద్ధి సాధించేందుకు ద్రవ్య లోటును స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 4.5 శాతానికి కట్టడి చేయాల్సిన అవసరం ఉందని ఈవై ఇండియా తెలిపింది. జీడీపీలో రుణాల నిష్పత్తి 54.4 శాతంగా ఉందని, దీన్ని తగ్గించాలని పేర్కొంది. ఫిస్కల్ రెస్పాన్సిబిలిటీ అండ్ బడ్జెట్ మేనేజ్‌మెంట్ (ఎఫ్ఆర్‌బీఎం) లక్ష్యమైన 40 శాతానికి తీసుకురావాలని వెల్లడించింది. మధ్య కాలానికి వాస్తవిక జీడీపీ వృద్ధి లక్ష్యం 6.5% కంటే ఎక్కువగా నమోదు కావడానికి ప్రభుత్వం మూలధన వ్యయాలు పెంచాలని ఈవై ఇండియా సూచించింది. ప్రైవేటు రంగ పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వడ్డీ రేట్లను తగ్గించాలని అభిప్రాయపడింది. లక్షిత ఉపాధి పథకాలతో పట్టణ గిరాకీ పెంచి, 2025-26లో ఆర్థిక వృద్ధికి సహకరించాలని కోరింది.






## నన్ను చూస్తూనే ఉండటం నా భార్యకు ఇష్టం

- పూనావాలా

ఉద్యోగులు వారానికి 90 గంటలపాటు పని చేయాలని ఎల్‌అండ్‌టీ ఛైర్మన్ చేసిన వ్యాఖ్యలపై వివిధ వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతూనే ఉన్నాయి. ప్రముఖ పారిశ్రామికవేత్తలు కూడా తమదైన శైలిలో స్పందిస్తున్నారు. తాజాగా దీనిపై సీరమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సీఈవో అదర్ పూనావాలా మాట్లాడారు. ఆనంద్ మహీంద్రా వ్యాఖ్యలతో ఏకీభవించిన ఆయన.. ఎక్కువ గంటల విధానంపై పరోక్షంగా విమర్శలు గుప్పించారు. "నిజమే (ఆనంద్ మహీంద్రా), నా భార్య కూడా నేను మంచివాడినని అనుకుంటుంది. ఆదివారాలు నన్ను చూస్తూ ఉండటమే తనకు ఇష్టం. క్వాంటిటీ కంటే క్వాలిటీనే ముఖ్యం. వర్క్ లైఫ్‌ను బ్యాలెన్స్ చేసుకోవాలి" అంటూ ఎక్స్ వేదికగా స్పందించారు. అంతకుముందు ఆనంద్ మహీంద్రా ఇదే అంశంపై వ్యాఖ్యానిస్తూ.. 48, 70 లేదా 90.. ఇలా ఎన్ని గంటలు పని చేశామన్నది ముఖ్యం కాదని ఉత్పాదకతే ప్రధానమన్నారు. "నా భార్య ఎంతో మంచిది. ఆమెను చూస్తూ ఉండటం నాకెంతో ఇష్టం" అంటూ ఆనంద్ మహీంద్రా పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉంటే, 'ఇంట్లో కూర్చొని ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు? ఇంట్లో తక్కువ, ఆఫీసులో ఎక్కువగా ఉంటామని భార్యలకు చెప్పాలి. అవసరమైతే ఆదివారాలు కూడా పని చేయాలి' అంటూ ఎల్ అండ్ టీ ఛైర్మన్ సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. కార్మిక సంఘాలతో పాటు వ్యాపారవేత్తల నుంచీ విమర్శలు వెల్లువెత్తాయి. అయితే, ఆ వ్యాఖ్యలు విస్తృత ఆశయాన్ని ప్రతిబింబిస్తాయని, అసాధారణ ఫలితాలకు అసాధారణ కృషి అవసరమంటూ తమ ఛైర్మన్ వ్యాఖ్యలను ఎల్ అండ్ టీ సమర్థించే ప్రయత్నం చేసింది.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
సోమవారం
13 జనవరి
2025



# మార్చి 21 నుంచి ఐపీఎల్

## మే 25న ఫైనల్.. ఉప్పల్‌లో రెండు క్వాలిఫయర్స్



ముంబై: క్రికెట్ ప్రేమికులను అలరించేందుకు ఐపీఎల్ 18వ సీజన్ సిద్ధమవుతోంది. మార్చి 21 నుంచి లీగ్ జరగనుందని బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తెలిపాడు. ఆదివారం బోర్డు ప్రత్యేక సాధారణ సమావేశం (ఎస్‌జీఎం)లో పాల్గొన్న అనంతరం శుక్లా ఈ విషయాన్ని వెల్లడించాడు. 66 రోజులపాటు జరిగే ఈ లీగ్‌లో ఫైనల్ మే 25న కోల్‌కతా ఈడెన్ గార్డెన్స్‌లో జరుగుతుంది. అంతకుముందు రెండో ప్లేఆఫ్సను కూడా ఇక్కడే నిర్వహించనున్నారు. లీగ్‌లో తొలి రెండు క్వాలిఫయర్స్‌కు మాత్రం హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియం వేదిక కానుంది. పూర్తిస్థాయి షెడ్యూల్‌ను ప్రకటించాల్సి ఉంది. చాంపియన్స్ ట్రోఫీలో పాల్గొనే భారత జట్టును ఈనెల 18 లేక 19న వెల్లడిస్తామని శుక్లా తెలిపాడు. ప్రస్తుతానికి ఇంగ్లండ్, అఫ్ఘానిస్థాన్, న్యూజిలాండ్, బంగ్లాదేశ్ తమ ప్రాథమిక జట్లను ప్రకటించాయి.

సైకియా, ప్రభ్‌తేజ్ ఏకగ్రీవంగా..:

ఇద్దరు ఆఫీస్ బేరర్ల ఎన్నికే ఎజెండాగా ఆదివారం బీసీసీఐ ఎస్‌జీఎం జరిగింది. ఇందులో బోర్డు నూతన కార్యదర్శిగా అసోం క్రికెట్ సంఘానికి చెందిన దేవజిత్ సైకియా ఎన్నికయ్యాడు. జైషా ఐసీసీ చైర్మన్‌గా వ్యవహరిస్తుండడంతో అతడి స్థానంలో కొత్త కార్యదర్శి ఎంపిక అనివార్యమైంది. సైకియా ఇప్పటివరకు బోర్డు సంయుక్త కార్యదర్శిగా కొనసాగాడు. అలాగే ఇప్పటిదాకా కోశాధికారిగా ఉన్న ఆశిష్ షెలర్ మహారాష్ట్ర మంత్రి అయ్యారు. దీంతో ప్రభ్‌తేజ్ సింగ్ భాటియా కోశాధికారిగా ఎన్నికయ్యాడు.

# పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయాస్




చండీగఢ్: టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ శ్రేయాస్ అయ్యర్ ఐపీఎల్ ఫ్రాంచైజీ పంజాబ్ కింగ్స్ కొత్త కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. ఈమేరకు జట్టు యాజమాన్యం ఆదివారం అతడి పేరును ప్రకటించింది. గత నవంబరు మెగా వేలంలో శ్రేయాసను అత్యంత భారీ మొత్తం రూ.26.75 కోట్లు వెచ్చించి పంజాబ్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. దాంతో అతడినే సారథిగా నియమిస్తారని అంచనా వేశారు. 2024లో శ్రేయాస్ కెప్టెన్సీలోనే కోల్‌కతా నైట్‌రైడర్స్ టైటిల్ గెలిచింది. 'జట్టు నాపై నమ్మకం ఉంచడాన్ని గౌరవంగా భావిస్తున్నా. కోచ్ పాంటింగ్‌తో కలిసి మరోసారి పని చేసేందుకు ఎదురు చూస్తున్నా' అని అయ్యర్ స్పందించాడు. 2020లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు పాంటింగ్ హెడ్ కోచ్‌గా ఉన్న సమయంలో శ్రేయాస్ ఆ జట్టు కెప్టెన్‌గా వ్యవహరించాడు. వారిద్దరి ఆధ్వర్యంలో ఆ సీజన్‌లో ఢిల్లీ టోర్నమెంట్ రన్నర్‌పగా నిలిచింది.

# దుబాయ్ కార్ రేసులో అజిత్ కుమార్ టీం విక్టరీ..

## పలువురి విషెస్..





దుబాయ్‌లో జరిగిన 24 గంటల దుబాయ్ 2025 అంతర్జాతీయ కార్ రేస్‌లో కోలీవుడ్ స్టార్ హీరో అజిత్ కుమార్ నేతృత్వంలోని జట్టు మూడో స్థానంలో నిలిచింది. దీంతో అజిత్ అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కోలీవుడ్ టాప్ హీరోలలో ఒకరిగా ఉన్న అజిత్ కుమార్ కార్ రేసర్‌గా ఎంపికయ్యారు. ఆయన నాయకత్వంలోనే అజిత్‌కుమార్ రేసింగ్ పేరుతో ఒక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఈ జట్టు 24%ఎ% దుబాయ్ 2025 కార్ రేస్‌లో పాల్గొనడమే కాకుండా విజయం కూడా సాధించింది. ఈ రేసులో అజిత్ సారథ్యంలోని జట్టు మూడో స్థానంలో నిలిచి రికార్డు సృష్టించింది.

# జెమీమా సెంచరీ

## రెండో వన్డేలోనూ ఐర్లాండ్ చిత్తు



రాజ్‌కోట్: టాపార్డర్ బ్యాటర్లంతా ధనాధన్ బ్యాటింగ్‌తో అదరగొట్టారు. జెమీమా రోడ్రిగ్స్ (102) తొలి అంతర్జాతీయ శతకం నమోదు చేయగా, హర్లీన్ డియోల్ (89) కొద్దిలో సెంచరీ చేజార్చుకుంది. ఇక కెప్టెన్ మంధాన (73) తన జోరు కొనసాగించగా, యువ క్రీడాకారిణి ప్రతికా రావల్ (67) మరో అర్ధ హాఫ్ సెంచరీతో భళా అనిపించింది. దాంతో ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత్ 116 పరుగులతో ఐర్లాండ్‌ను చిత్తు చేసింది. మూడు మ్యాచ్‌ల సిరీసను మరో వన్డే మిగిలుండగానే కైవసం చేసుకుంది. తొలుత భారత్ 50 ఓవర్లలో 370/5 స్కోరు చేసింది. భారీ ఛేదనలో ఐర్లాండ్ 50 ఓవర్లలో 254/7 స్కోరుకే పరిమితమైంది. క్రిస్టినా (80) అర్ధ శతకంతో సత్తా చాటింది.

**47 ఏళ్లలో తొలిసారి..:**


1978లో ఇంగ్లండ్‌పై భారత మహిళల జట్టు తొలి వన్డే ఆడింది. ఆ క్రమంలో 47 ఏళ్ల తర్వాత మన జట్టు మొదటిసారి వన్డేలలో 370 పరుగుల మార్క్‌ను అందుకొని రికార్డు సృష్టించింది.

**సంక్షిప్తస్కోర్లు**

భారత్: 50 ఓవర్లలో 370/5 (జెమీమా 102, హర్లీన్ 89, మంధాన 73, ప్రతిక 67, ప్రెండెర్‌గాస్ట్ 2/75, కెల్లీ 2/82).

ఐర్లాండ్: 50 ఓవర్లలో 254/7 (క్రిస్టినా 80, సారా 38, డెలానీ 37, దీప్తి శర్మ 3/37, ప్రియ 2/53).

# ఆస్ట్రేలియన్ ఓపెన్ సబలెంక, జ్వెరెవ్ శుభారంభం



మెల్‌బోర్న్: డిఫెండింగ్ చాంప్ అర్యానా సబలెంక, రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరెవ్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో శుభారంభం చేశారు. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో టాప్ సీడ్ సబలెంక 6-3, 6-2తో స్లోన్ స్టీఫెన్స్‌పై అలవోకగా నెగ్గింది. చైనా ప్లేయర్ క్విన్‌వెన్ జాంగ్ 7-6(3), 6-1తో అంకా తొడోనిను, 11వ సీడ్ పౌలా బడోసా 6-3, 7-6(5)తో వాంగ్ జిన్‌ను, ఆండ్రీవ 6-3, 6-3తో బజ్కోవాను, డోనా వెకిక్ 6-4, 6-4తో డయానిను ఓడించి రెండో రౌండ్‌కు చేరుకొన్నారు. పురుషుల్లో జ్వెరెవ్ 6-4, 6-4, 6-4తో లూకాస్‌పై, ఆరో సీడ్ కాస్పర్ రూడ్ 6-3, 1-6, 7-5, 2-6, 6-1తో మునార్‌పై గెలిచి నెగ్గారు.

నగాల్‌కు నిరాశ: భారత ఆటగాడు సుమీత్ నగాల్ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టాడు. 26వ సీడ్ థామస్ మచాక్‌తో పోరులో నగాల్ 3-6, 1-6, 5-7తో వరుస సెట్లలో పరాజయం పాలయ్యాడు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News



# శారీలో పాప అదుర్స్..!



ఇలా వచ్చి అలా రెండు సినిమాలకే స్టార్ క్రేజ్ తెచ్చుకున్న ముద్దుగుమ్మ శ్రీలీల ధమాకా హిట్ తో సెన్సేషనల్ అనిపించగా ఆ క్రేజ్ తో ఒకేసారి ఐదారు సినిమాల ఆఫర్లు అందుకుంది. ఇంకేముందు ఇక కెరీర్ కు తిరుగులేదని అనిపించగా వరుస ఫ్లాపులు శ్రీలీల గ్రాఫ్ పడిపోయేలా చేశాయి. ఐతే కథల విషయంలో కాస్త ఆచి తూచి అడుగు వేయాలని తర్వాత తెలుసుకున్న అమ్మడు ఇప్పుడు మళ్లీ వరుస ఆఫర్లు అందుకుంటుంది.

ప్రస్తుతం నితిన్ రాబిన్ హుడ్ రవితేజాతో మాస్ జాతర సినిమాల్లో నటిస్తుంది శ్రీలీల. ఈ రెండు సినిమాలతో తిరిగి ఫాంలోకి రావాలని చూస్తుంది శ్రీలీల. ఐతే ఆడియన్స్ కు కేవలం సినిమాలతోనే కాదు తన ఫోటో షూట్స్ తో కూడా మంచి ట్రీట్ ఇస్తుంది శ్రీలీల. లేటెస్ట్ గా పింక్ శారీలో శ్రీలీల స్టిల్స్ అదిరిపోయాయి. పింక్ శారీలో అమ్మడి లుక్స్ కుర్రాళ్లను క్లీన్ బౌల్డ్ చేస్తున్నాయి. శారీలో కూడా ఫోటో షూట్ చేసి ఫాలోవర్స్ ని పిచ్చెక్కిస్తుంది శ్రీలీల.

ఫోటో షూట్ అంటే స్కిన్ షో చేయాలన్న సమీకరణాలు మార్చేస్తుంది అమ్మడు. ఇలా శారీ లుక్స్ తో కూడా ఎట్రాక్ట్ చేస్తుంది. సినిమాలు, ఫోటో షూట్స్ ఇవి రెండు పార్లర్ గా కథానాయికల కెరీర్ ను తీసుకెళ్తాయి. ఒక్కోసారి సినిమాలు ఫ్లాప్ అయ్యి వారి కెరీర్ రిస్క్ లో పడినా కూడా ఈ ఫోటో షూట్స్ వారికి మంచి పాపులారిటీ తెచ్చేలా చేస్తాయి. శ్రీలీల ఏం చేసినా దానికో లెక్క ఉ ంటుంది అనిపించేలా ఫోటో షూట్స్ లో కూడా తన స్పెషాలిటీ చూపిస్తుంది అమ్మడు.



# మాజీ ప్రియుడి గురించి పీసీ బహిరంగంగా

ఇండస్ట్రీ ఔట్ సైడర్ ప్రియాంక చోప్రా ఒక నటిగా ఎంతో సాధించింది. గ్లోబల్ స్టార్‌గా ఎందరికో స్ఫూర్తి. బాలీవుడ్ టు హాలీవుడ్ పీసీ ప్రయాణం, విజయాల గురించి ప్రజలకు తెలుసు. ప్రపంచ సుందరిగా కిరీటం గెలుచుకున్న ప్రియాంక చోప్రా, బాలీవుడ్ అగ్ర కథానాయికగా ఎన్నో విజయవంతమైన సినిమాల్లో నటించింది. అయితే కింగ్ ఖాన్ షారూఖ్ ఖాన్ తో పీసీ ప్రేమాయణం నిజంగా తన కెరీర్ ని నాశనం చేసిందని చాలా ప్రచారం ఉంది. షారూఖ్ తో డాన్ 2 సమయంలో ఎంతో సన్నిహితంగా మారిన ప్రియాంక చోప్రాను గౌరీఖాన్ సైతం హెచ్చరించిందని, తన భర్తకు దూరంగా పెట్టేందుకు ప్రయత్నించిందని కథనాలొచ్చాయి. షారూఖ్ తో పీసీ చనువును గౌరీఖాన్ అస్సలు సహించలేకపోయిందని, ఆ తర్వాత పరిణామాలు వేగంగా మారిపోయాయని, ఉన్నట్టుండి సడెన్ గా పీసీ కెరీర్ డౌన్ ఫాల్ అవ్వడం, దేశం విడిచి వెళ్లిపోవాలనుకోవడం లాంటి విషయాలు చర్చకు వచ్చాయి. ప్రియాంక చోప్రా బాలీవుడ్ వదిలి వెళ్లిపోవడానికి కారణం గౌరీఖాన్ సన్నిహితుడు కరణ్ జోహార్ అని క్వీన్ కంగన రనౌత్ పలు సందర్భాల్లో వాదించారు. మాఫియా పీసీని బెదిరించిందని కంగన బహిరంగ వేదికపైనే విమర్శించింది. ఇదిలా ఉంటే, ప్రియాంక చోప్రా ఇటీవల షారుఖ్ ఖాన్ తో పాత రిలేషన్ పై ఊహాగానాలను మరోసారి రగిలించింది. తాను ఎంతగానో ఇష్టపడే లెదర్ జాకెట్ గురించి చెబుతూ అది తన 'మాజీ బాయ్ ఫ్రెండ్స్'లో ఒకరికి చెందినదని చెప్పింది. 'డర్టీ లాండ్రీ' అనే టాక్ షోలో మాట్లాడుతూ.. ఆ జాకెట్‌ను తన 'ఎయిర్ పోర్ట్ జాకెట్'గా అభివర్ణించింది. అయితే ఇంతలోనే నెటిజనులు పీసీ లెదర్ జాకెట్ తో పాటు, షారూఖ్ ధరించిన లెదర్ జాకెట్ ఫోటోని జోడించి వైరల్ చేయడం ప్రారంభించారు. ఆ ఇద్దరి మధ్యా పాత ఎఫైర్ గురించి తిరిగి ప్రచారం మొదలైంది. నేరుగా ఖాన్ పేరు చెప్పకపోయినా కానీ నెటిజనులు చాలా వేగంగా పీసీ మాజీ ఎవరో కనిపెట్టేసారు.

# సూపర్‌హీరో మూవీలో వామిక జాక్‌పాట్?



2025 ప్రముఖ బాలీవుడ్ కథానాయిక వామిక గబ్బికి ప్రత్యేక సంవత్సరం కానుంది. ఈ ఏడాదిలో రెండు భారీ ప్రాజెక్టుల్లో నటిస్తోంది వామిక. వీటిలో ఒకటి అక్షయ్ కుమార్ తో భూత్ బంగ్లా. మరొకటి రణవీర్ సింగ్ సరసన సూపర్ హీరో సినిమాలో నటించే వీలుందని కథనాలొస్తున్నాయి. బాలీవుడ్ లో ఒక్కో సినిమాతో తనదైన ముద్ర వేస్తూ వామిక గబ్బి అగ్ర హీరోయిన్ రేసులోకి చేరుకుంది. ఇటీవల చాలామంది సీనియర్ నటీమణులకు దక్కాల్సిన ఛాన్సుల్ని ఈ కుర్రబ్యూటీ తన ఖాతాలో వేసుకుంటోంది. అక్షయ్ కుమార్ 'భూత్ బంగ్లా' షూటింగ్ ఇప్పటికే ప్రారంభమైంది. ప్రస్తుతం జైపూర్‌లో భూత్ బంగ్లా షూటింగ్‌లో ఖిలాడీ అక్షయ్ పాల్గొంటున్నారు. ఇప్పుడు వామికా గబ్బి అతడితో సెట్స్‌లో చేరింది. తాజాగా వామికా గబ్బి ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక వీడియోను షేర్ చేసింది. ప్రస్తుతం ఈ వీడియో అంతర్జాలంలో వైరల్ అవుతోంది. 'దిల్ కా దర్వాజా ఖోల్ దో నా డార్లింగ్' చిత్రంలో సిద్ధాంత్ చతుర్వేది, జయా బచ్చన్‌లతో కలిసి వామిక నటిస్తోంది. ఆదిత్య రాయ్ కపూర్ - సమంతా రూత్ ప్రభు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'రక్త్ బ్రహ్మాండ్' వెబ్ సిరీస్‌లో కూడా భాగం కానుంది. నాని సరసన ఓ తమిళ చిత్రంలో నటించనుందని టాక్ ఉంది.

అయితే వీటన్నిటిలో సూపర్ హీరో మూవీలో ఆఫర్ గురించి ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రతిభావంతుడైన దర్శకుడు బాసిల్ జోసెఫ్ తెరకెక్కించనున్న సూపర్ హీరో సినిమాలో రణ్‌వీర్ సింగ్ సరసన కథానాయిక పాత్రకు వామికా పోటీపడుతోందని బలంగా టాక్ వినిపిస్తోంది. ఒకవేళ పరిస్థితులు అనుకూలిస్తే వామికా ఈ పాత్రను దక్కించుకునే అవకాశం ఉంది. గతంలో బాసిల్ జోసెఫ్ తెరకెక్కించిన మలయాళ చిత్రం 'గోధా'లో నటించింది, దీంతో వామిక సూపర్ హీరో మూవీలో ఛాన్స్ కొట్టేయడం ఖాయమని చెబుతున్నారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986